సాక్షి
వికారాబాద్
సోమవారం । 7 । అక్టోబర్ । 2024



ఫ్యాక్టరీ లేక.. వెతలు తీరక

స్థానికంగా చెరుకు ఫ్యాక్టరీ లేకపోవడంతో సుమారు 35 ఏళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



పర్యాటకుల తాకిడి

కోట్‌పల్లి ప్రాజెక్టులో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. 8లో▸



పత్తి ముంచింది!

పత్తి రైతుకు దిగులు తప్పడం లేదు. ఈ పంటను నమ్ముకున్న రైతన్నకు వరుణుడు నట్టేట ముంచేశాడు. 9లో▸

నిలిచిన ఆయుష్

ఆస్పత్రులున్నా నిరుపయోగం

- వైద్యులు, సిబ్బంది, మందుల కొరత
- ఆరు వైద్యశాలల్లో నాలుగు మూత
- ఇన్‌చార్జితో కొనసాగుతున్న దౌల్తాబాద్, దుద్యాల ఆస్పత్రులు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని వినతి

మారుతున్న కాలం.. తీసుకుంటున్న ఆహారం కారణంగా ఎందరో రోగాల బారిన పడుతూ మందుల సంచులు వెంటబెట్టుకుని తిరుగుతున్నారు. గతంలో ప్రభుత్వం అల్లోపతి వైద్యానికి ప్రత్యామ్నాయంగా ఆయుర్వేదం, హోమియోపతి, యునాని తదితర ప్రకృతి వైద్యం ప్రజలకు అందించేందుకు ఆయుష్ ఆస్పత్రులు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వైద్యులు, సిబ్బంది కొరతతో అవి మూత పడుతున్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని ఆయుష్ కళాశాలలు ఏర్పాటు చేసి ఆయుర్వేద వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

కొడంగల్: రాష్ట్ర ప్రభుత్వం ఆయుర్వేద వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని విద్యావంతులు కోరుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, దౌల్తాబాద్, దుద్యాల, బొంరాస్‌పేట మండలాల్లో ఆయుర్వేద వైద్యశాలలున్నా నిరుపయోగంగా మారాయి. డాక్టర్లు, వైద్య సిబ్బంది లేక మూత పడ్డాయి. గతంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆయుర్వేద వైద్యశాలలు నేడు దయనీయ స్థితిలో ఉన్నాయి. కొడంగల్, దౌల్తాబాద్, దుద్యాల, బొంరాస్‌పేట మండలాల్లో ఆరు ఆయుర్వేద వైద్యశాలలు ఉన్నాయి. కొడంగల్ మండలంలో రుద్రారం, అంగడిరాయిచూర్, బొంరాస్‌పేట మండలంలో బొంరాస్‌పేట, దుద్యాల మండలంలో దుద్యాల, దౌల్తాబాద్ మండలంలో దౌల్తాబాద్, కోస్గి మండలంలోని గుండుమాల్‌లో ఆయుర్వేద వైద్యశాలలు ఉన్నాయి. ప్రస్తుతం దౌల్తాబాద్, దుద్యాల ఆస్పత్రుల్లో ఇన్‌చార్జిలతో కొనసాగుతుండగా మిగిలిన నాలుగు ఆస్పత్రులు నిరుపయోగంగా మారాయి. ఒక్కో దవాఖానలో ఒక డాక్టర్, కంపోండర్, అటెండర్ ఉండాలి. ప్రభుత్వం వైద్యులను, కిందిస్థాయి సిబ్బంది పోస్టుల భర్తీ చేయక ఆస్పత్రులు మూతపడ్డాయి. ఇన్‌చార్జిలు ఉన్న చోట సైతం మందులు అందుబాటులో లేవు. ప్రభుత్వ ప్రోత్సాహం లభించిక ప్రాచీన విద్యగా పేరుగాంచిన ఆయుర్వేదం కనుమరుగవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని ఆయుర్వేద వైద్యానికి ప్రాధాన్యతనిచ్చి వైద్యులను నియమించాలని కోరుతున్నారు. ఆస్పత్రులకు పూర్వ వైభవం తీసుకురావాలని ఆయుష్ విద్యార్థులు విన్నవిస్తున్నారు.



మూతబడిన రుద్రారం ఆయుర్వేద వైద్యశాల



వైద్యులు లేక తెరుచుకోని దౌల్తాబాద్ ఆస్పత్రి

కొరవడిన పర్యవేక్షణ

నియోజకవర్గంలోని ఆయుర్వేద ఆసుపత్రులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. వీటి పర్యావేక్షణ అధికారి కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ చూడాల్సి ఉంటుంది. కానీ ఆయన ఇక్కడకు రారు.. పరిశీలించరనేది విమర్శలున్నాయి. ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని ఆయుర్వేద ఆస్పత్రుల్లో పోస్టులు భర్తీ చేయాలి.

ఆయుష్ కళాశాల మంజూరు చేయండి

కొడంగల్ కేంద్రంగా ఆయుష్ కళాశాలను మంజూరు చేయాలని ఆయుర్వేద విద్యార్థులు కోరుతున్నారు. నియోజకవర్గానికి చెందిన వందలాది మంది విద్యార్థులు కర్ణాటక రాష్ట్రానికి వెళ్లి బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్ వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఈ ప్రాంతలో ఆయుష్ కళాశాలను ఏర్పాటు చేస్తే ఇక్కడి విద్యార్థులకు మేలు చేకూరుతుంది. ఈ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్యం అందే అవకాశం ఉంటుంది. ఇదే విషయమై ప్రజలకు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు ఎన్నో కళాశాలలను మంజూరు చేశారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారు. ఇప్పటికే మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ గురుకులాలు, వృత్తి విద్యా కళాశాల, స్కిల్ యూనివర్సిటీ, ఇంజినీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, కొత్త మండలాల్లో జూనియర్ కళాశాలలను మంజూరు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయుష్ కళాశాలను మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

పూలే, అంబేడ్కర్ ఆశయాలే దేశానికి మార్గదర్శకాలు

అంబేడ్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్: పూలే, అంబేడ్కర్ ఆశయాలే దేశానికి మార్గదర్శకం అని అంబేడ్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం అన్నారు. ఆదివారం సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యూ.రమేశ్‌బాబు అధ్యక్షతన స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మనువాదుల చేతుల్లో తరతరాలుగా వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో సమానత్వాన్ని సాధించేందుకు పూలే అంబేడ్కర్ విధానాలను పాటించాలన్నారు. గడప గడపకూ అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని విస్తరించేందుకు యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ ప్రజా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల కొండల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలె సురేందర్, ఎం.ప్రభాకర్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, బుడగ జంగాల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్య, డీపీఎంసీ సభ్యులు దస్తప్ప, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గోవా రైలుకు స్వాగతం పలికిన బీజేపీ నేతలు



రైలుకు స్వాగతం పలికిన నాయకులు

షాద్‌నగర్: సికింద్రాబాద్ నుంచి షాద్‌నగర్ మీదుగా గోవాకు నూతనంగా ప్రారంభించిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ రైలుకు షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, కందూరి మనోహర్‌రెడ్డి, సుధాకర్, చెట్ల వెంకటేశ్, వంశీకృష్ణ, నర్సింహ యాదవ్, మహేందర్‌రెడ్డి, ఎం కనోళ్ల వెంకటేశ్, మఠం రుషికేష్, నరేందర్‌రెడ్డి, కృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నియామకం

షాబాద్: రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మండలంలోని ఆస్పల్లిగూడ గ్రామానికి చెందిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు.

టీపీఎఫ్ సదస్సును జయప్రదం చేయండి

షాద్‌నగర్: పదిహేనేళ్ల ఉద్యమ ప్రయాణంలో టీపీఎఫ్ (తెలంగాణ ప్రజాఫ్రంట్) ఎన్నో ఉద్యమాలు చేపట్టిందని ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు అర్జునప్ప అన్నారు. 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 9న నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అర్జునప్ప మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టిన కేసీఆర్ ప్రజాఫ్రంట్ మీద తీవ్ర నిర్బంధాన్ని అమలు చేశారన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఫ్రంట్ ఉనికి లేకుండా చేయాలని చూశారని ఆరోపించారు. ఫ్రంట్ నాయకులు గుండె నిబ్బరంతో ఎదుర్కొన్నారని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తి చూపేందుకే సమయాన్ని వృథా చేస్తోందన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణాలు మాఫీ చేయలేదని, రైతుబంధు నేటికీ రైతుల ఖాతాల్లో జమ చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ సుధాకర్, షాద్‌నగర్ కన్వీనర్ టీజీ శ్రీనివాస్, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



శేషవాహనంపై పద్మనాభ స్వామి ఊరేగింపు

హనుమద్వాహనంపై శ్రీవారు.. శేషవాహనంపై పద్మనాభుడు

వికారాబాద్ పట్టణంలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు, ఆలంపల్లిలో శ్రీలక్ష్మీ అనంత పద్మనాభ స్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి వేంకటేశ్వర స్వామి హనుమద్వాహనంపై, పద్మనాభ స్వామి శేషవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. – అనంతగిరి



హనుమద్వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరుడు

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తాచాటుదాం

- పార్టీలకు అతీతంగా ముదిరాజ్‌లను గెలిపించుకుందాం
- ముదిరాజ్ మహాసభ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్



మాట్లాడుతున్న కాసాని వీరేశ్ ముదిరాజ్

అనంతగిరి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లు సత్తా చాటాలని ముదిరాజ్ మహాసభ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఎన్నేపల్లిలో రాష్ట్ర ముదిరాజ్ మహాసభ జిల్లా ముఖ్యనాయకు ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన వీరేశ్ ముదిరాజ్ మాట్లా డుతూ.. స్థానిక సంస్థల్లో పోటీ చేసే ముదిరాజ్‌లను పార్టీలకు అతీతంగా గెలుపించుకోవాలని సూచించారు. ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చే వరకు పోరాటం కొనసాగిద్దామన్నారు. కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లకు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు రాములు తదితరులున్నారు.

రాకొండలో భూ వివాదం

- కొడవళ్లు, కర్రలతో ఇరువర్గాల దాడులు
- ఇద్దరికి తీవ్ర, నలుగురికి స్వల్పగాయాలు
- ఐదుగురిపై అట్రాసిటీ కేసు



గాయాలతో చికిత్స పొందుతున్న మనోజ్



కర్రలతో దాడి చేసుకుంటున్న ఇరువర్గాల రైతులు

దోమ: భూ వివాదంలో ఇరువర్గాలు పరస్పర దాడులు చేసుకున్నాయి. ఈ ఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు, ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ తెలిపిన ప్రకారం.. రాకొండ గ్రామంలో 1983లో సర్వేనంబర్ 94లో 21 ఎకరాల అసైన్డ్ భూమి గ్రామానికి చెందిన కొంత మంది రైతులకు ప్రభుత్వం సర్టిఫికెట్లు ఇచ్చింది. గ్రామానికి చెందిన చాపల నర్సమ్మ భర్త నర్సయ్యకు సర్వే నంబర్ 94/3/క/5లో 2.12 ఎకరాలు ఇవ్వగా.. బండి మనోజ్‌కు 94/3/క/1/2లో 1.06 ఎకరాలు కేటాయించారు. ఈ భూమిలో కొంత భాగం గుట్టలుండడంతో సాగు యోగ్యంగా లేదు. ఉన్న కొద్దిపాటి భూమిని ఇరువురు రైతులు సాగు చేసుకుంటునప్పటికీ కొన్నేళ్లుగా భూమి తమదంటే.. తమదంటూ ఇరువురూ గొడవపడుతున్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు అప్పట్లో భూమిని పరిశీలించారు. వారికి సర్దిచెప్పారు. మీరు ఇలాగే తగువులాడితే పీఓటీ కింద భూమిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో కొంత కాలంగా ఇద్దరూ భూమికి దూరంగా ఉన్నప్పటికీ ఇటీవలే చాపల నర్సమ్మ కుమారుడు చాపల రాములు కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నాడు. అదే భూమిలో బండి మనోజ్, నర్సింలు భూమిని చదును చేసుకుని పంట వేసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న చాపల రాములు పొలం వద్దకు చేరుకుని ఈ భూమి తమదేనంటూ జడ్జిమెంట్ కాపీ ఉందని.. మీరెలా సాగు చేస్తారని వాగ్వాదానికి దిగారు. ఈ విషయం రెవెన్యూ, పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సర్వేచేసి భూమి కేటాయిస్తామని చెప్పారు. రెండు రోజుల క్రితం రెవెన్యూ అధికారులు పోలీసులతో కలిసి సర్వేకు వెళ్లారు. ఇరువర్గాల వివాదస్పద వ్యాఖ్యలతో అధికారులు సర్వే చేయకుండానే వెనుదిరిగారు. ఇదే విషయంలో ఆదివారం ఇరువర్గాల మధ్య మాటలు పెరిగి కొడవళ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో మనోజ్, నర్సింహులుకు తీవ్రగాయాలవ్వగా.. చాపల రాములు కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం?

ఇరువర్గాల భూ వివాదానికి రెవెన్యూ అధికారులే కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అప్పట్లో పేదలకు ప్రభుత్వం అసైన్డ్ భూమిని కేటాయిస్తే అందులో కొంత భాగం గుట్టలుండడంతో ఇరువర్గాల మధ్య పంచాయితీ సాగుతోంది. అప్పుడే రెవెన్యూ అధికారులు సర్వే చేసి భూమి కేటాయిస్తే గొడవలు జరిగేవి కావని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్వే కోసం రైతులు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సర్వేచేసి రైతులకు భూ కేటాయింపులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘర్షణపై కేసులు

భూ వివాదంలో ఘర్షణకు పాల్పడిన ఐదుగురు వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ కుమార్ తెలిపారు. బండి మనోజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టి చాపల రాములు, నర్సింహులు, మానస, లక్ష్మి, ఆంజనేయులుపై అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. మరో రైతు తమకు ఫిర్యాదు ఇవ్వలేదన్నారు.

దాడి హేయనీయం

పరిగి: దళితులపై భూ విషయంలో దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం దోమ మండలంలోని రాకొండ గ్రామంలో ఇరువర్గాల మధ్య భూ తగాదాలతో దాడులు జరిగాయి. దీంతో ఆయన పట్టణ కేంద్రంలో బాధితులతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. దళితులపై దాడి చేసిన అగ్రకుల పెత్తందారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసిన పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





కూరల సిరి తగ్గింది మరి

జిల్లాలో గణనీయంగా పడిపోయిన కూరగాయల సాగు

జిల్లాలో కూరగాయల సాగు

సంవత్సరం	విస్తీర్ణం (ఎకరాల్లో)
2018–19	53,825
2019–20	59,070
2020–21	38,248
2021–22	33,669
2022–23	29,826
2023–24	24,314

ఉత్పత్తులు (టన్నుల్లో)

సంవత్సరం	ఉత్పత్తి
2018-19	6,62,418
2019-20	6,11,785
2020-21	3,75,674
2021-22	2,63,827
2022-23	3,08,118
2023-24	2,15,145

ఇష్టమైన కూరతో కడుపునిండా భోజనం చేయాలనుకునే వారికి నిజంగా ఇది చేదు వార్తే. నచ్చిన కూరగాయ దొరకడం కష్టంగా మారింది. ఒకవేళ దొరికినా వాటి ధరలు చూస్తే వామ్మో అనాల్సిందే. రెండు మూడు కిలోలు కొనుగోలు చేయాలని మార్కెట్‌కు వచ్చిన వారు రేటు చూసి పావుకిలో సంచిలో వేసుకుని వెళ్తున్నారు. కూరగాయలే కాదు ఆకు కూరల ధరలు సైతం అమాంతం పెరిగాయి. సాగు విస్తీర్ణం తగ్గడమే ఇందుకు కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- ఖర్చులు పెరిగి ఆసక్తి చూపని రైతులు
- రియల్ వెంచర్లుగా మారుతున్న పొలాలు
- ఎగుమతి చేసే స్థాయి నుంచి దిగుమతి
- మార్కెట్లలో మండిపోతున్న ధరలు
- కొద్ది మోతాదులో సర్దుకుంటున్న జనం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఒకప్పుడు ఎటుచూసినా కాయగూరలు, పండ్ల సాగుతో పచ్చగా కనిపించే జిల్లాలోని వ్యవసాయ భూములు నేడు రియల్టర్ల గుప్పిట్లో బందీ అయ్యాయి. తాజా కూరలు, పండ్లను పుష్కలంగా పండించి, నగరానికి ఎగుమతి చేసిన రైతులు ప్రస్తుతం రోజువారీ అవసరాలకు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అవు తున్న పంటలపై ఆధారపడుతున్నారు. ఏటా కూరగాయల సాగు తగ్గుతుండడం, డిమాండ్‌కు తగ్గట్టు దిగుబడి లేకపోవడంతో మార్కెట్లో ఆయా కూరగాయల ధరలు రెట్టింపు అవుతున్నాయి. షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, బాలాపూర్, హయత్‌నగర్, జల్‌పల్లి, సరూర్‌నగర్, వనస్థలిపురం, మెహిదీపట్నం సహా ఏ రైతు బజార్‌లో చూసినా.. ఏ రకమైన కూరగాయ అయినా కిలో రూ.40 నుంచి రూ.60 వరకు ధర పలుకుతోంది. దీంతో కిలో కొనాలనుకునే వారు పావుకిలోతో సరిపెట్టుకుంటున్నారు.

తగ్గిన దిగుబడి

సాగు విస్తీర్ణమే కాదు దిగుబడి కూడా గణనీయంగా తగ్గింది. ఒకప్పుడు ఎకరానికి 30 నుంచి 40 టన్నుల దిగుబడి వచ్చే పంట ప్రస్తుతం రెండు మూడు టన్నులకే పరిమితం అవుతోంది. ఆకు ముడత, పచ్చపురుగు వంటి క్రిమి కీటకాలకు తోడు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరదలకు పంట దిగుబడి భారీగా తగ్గింది. వర్షానికి కాయలకు మచ్చలు ఏర్పడుతున్నాయి. తాజాగా నిఘనిఘలాడాల్సిన ఈ కాయగూరలు ఎందుకూ పనికి రాకుడా పోతున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఇష్టపడక పోవడంతో వాటిని మార్కెట్లోనే పారబోసి వెళ్లాల్సి వస్తోంది.

ఖర్చు పెరిగింది



కూరగాయలు సాగు చేద్దామంటే కూలీల ఖర్చు భారంగా మారింది. నాకున్న 15 ఎకరాల్లో సగం వరి, మిగితా సగం వివిధ రకాల కూరగాయలు సాగు చేసేవాడిని. కూరగాయల సాగుతో వచ్చే లాభాలతో వరి పంటలో పెట్టుబడులు పెట్టేవాళ్లం. కుటుంబ అవసరాలకు డబ్బులు అందేవి. ప్రస్తుతం కూరగాయలు సాగు చేద్దామంటే దుక్కులు దున్నడం నుంచి మార్కెట్‌కు తరలించే వరకు కూలీలపైనే ఆధారపడాల్సి వస్తోంది. గిట్టుబాటు కాకపోవడంతో సాగు బంద్ చేశాను.

– కొంగళ్ల జోగిరెడ్డి, రైతు నందివనపర్తి

రాయితీలు లేవు



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో కూరగాయల విత్తనాలు, సాగుకు వాడే యంత్రాలపై రాయితీ ఉండేది. పదేళ్లుగా రాయితీలన్నీ బంద్ చేశారు. నాకున్న రెండున్నర ఎకరాల పొలంలో అర ఎకరాలోనే పలు రకాల కూరగాయల పంటలు సాగు చేస్తున్నాను. అతివృష్టి, అనావృష్టితో పంటలకు నష్టం జరిగితే అప్పట్లో పరిహారం అందించేవారు. ఇప్పుడు పరిహారం దేవుడెరుగు నష్టపోయిన పంటలను చూసే వారే లేరు.

– కాశమల్ల రాములు, రైతు, చౌదర్‌పల్లి

కరువైన ‘ప్రోత్సాహం’

కూరగాయల సాగు రైతుకు భారంగా మారింది. క్రిమి సంహారక మందులు, ఫెర్టిలైజర్ ఖర్చులు భారీగా పెరిగాయి. అనేక వ్యయ ప్రయాసలకోర్చి పంట పండిస్తే.. తీరా మార్కెట్లోకి వచ్చేసరికి ధర ఉండటం లేదు. గిట్టుబాటు కాక రైతులు వీటి సాగుకు ఆసక్తి చూపించడం లేదు. అంతేకాదు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. ప్రభుత్వం డ్రిప్, పాలీహౌస్‌లు, నెట్ హౌస్‌లకు ఇస్తున్న రాయితీ కూడా తగ్గించింది. రైతు ఆసక్తి చూపించకపోవడానికి ఇవి కూడా కారణం అవుతున్నాయి. కూరగాయలే కాదు పండ్ల తోటల సాగు కూడా భారీగా తగ్గింది.

క్లుప్తంగా

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి


రవీందర్ (ఫైల్)

పెద్దేముల్: గుండెపోటుతో ఓ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. తాండూరుకు చెందిన కావలి రవీందర్(38) పెద్దేముల్ ఠాణాలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న ఆయన్ను లేపేందుకు కుటుంబసభ్యులు యత్నించగా ఉలుకూపలుకు లేకపోవడంతో స్థానికులు వచ్చి చూడగా విగతజీవిగా పడి ఉన్నారు. గుండెపోటుతో నిద్రలోనే మృతి చెంది ఉంటాడని కుటుంబసభ్యులు భావించారు. ఆయనకు పదేళ్ల క్రితమే వివాహమైంది. భార్య మహేశ్వరి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రవీందర్ అకాల మరణంతో కుటుంబసభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తాండూరు రూరల్: మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామ శివారులోని కాగ్నా నది వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను కరన్‌కోట్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకట్‌రాంరెడ్డి వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

బాధితులకు ఫోన్ల అప్పగింత


బాధితులకు ఫోన్లను అందిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

కొడంగల్ రూరల్: ఇటీవల దొంగతనానికి గురైన ఫోన్లను పోలీసు సిబ్బంది సీఈఐఆర్ యాప్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకొని బాధితులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన రాజేందర్, ప్యాలమద్ది గ్రామానికి చెందిన మల్లేష్‌ల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ల దొంగిలించారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యాప్ ద్వారా పరిశోధన చేసి బాధితులకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

తల్లీకూతురి అదృశ్యం


చిన్నారితో స్వప్న (ఫైల్)

మొయినాబాద్: హోటల్‌లో హౌస్‌కీపింగ్‌గా పనిచేసే మహిళతో పాటు ఏడాది వయసున్న కూతురు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన మొగుట్టం సంజయ్ భార్య స్వప్న(21) మొయినాబాద్‌లోని ఓ హోటల్‌లో హౌస్‌కీపింగ్‌గా పనిచేస్తుంది. రోజు మాదిరిగానే శనివారం ఆమె పనికి వెళ్లింది. రాత్రి 7 గంటలకు భార్యను తీసుకురావడానికి సంజయ్ హోటల్ వద్దకు వెళ్లాడు. అయితే ఆమె 6.40కే నగరంలో ఉండే తమ బాబాయ్ వద్దకు పాపను తీసుకుని వెళ్లినట్లు హోటల్ యజమాని చెప్పారు. అయితే ఆమె అక్కడకు వెళ్లలేదు. ఇతర బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో సంజయ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఫ్యాక్టరీ లేక.. వెతలు తీరక

స్థానికంగా చెరుకు ఫ్యాక్టరీ లేకపోవడంతో సుమారు 35 ఏళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇతర ప్రాంతాలకు పంటను తీసుకెళ్లి విక్రయించాల్సిన దుస్థితి దాపురించింది. రవాణా, కూలీల వ్యయం తలకు మించిన భారంగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ తాండూరు, పెద్దేముల్ పరిసర ప్రాంత రైతులు అనుభవిస్తున్న మనోవేదన.


పెద్దేముల్‌లో సాగవుతున్న చెరుకు పంట

- చేదవుతున్న చెరుకు సాగు
- దళారులతో నష్టపోతున్న రైతులు
- పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్


ఇతర ప్రాంతాలకు లారీల ద్వారా చెరుకును తరలిస్తున్న రైతులు (ఫైల్)

పెద్దేముల్: చెరుకు సాగుకు అనువైన నేలలు జిల్లాలో తాండూరు, పెద్దేముల్, కోట్‌పల్లి, ధారూరు, మర్పల్లి, మోమిన్‌పేట, నవాబుపేట, బంట్వారంతో పాటు పలు మండలాల్లో ఉన్నాయి. దీంతో రైతులు ఈ పంటను సాగుచేస్తున్నారు. గతంలో జిల్లాలో సుమారు 25వేల ఎకరాలకు పైగా సాగయ్యేది. ప్రస్తుతం 15వేల ఎకరాలకే పరిమితమైంది. పెద్దేముల్ మండలంలో సుమారు మూడు వేల ఎకరాలు సాగు అవుతుంది. ప్రస్తుతం స్థానికంగా చెరుకు ఫ్యాక్టరీలు అందుబాటులో లేక సంగారెడ్డి-గణేశ్, కర్ణాటక-యాద్గీర్, మహబూబ్‌నగర్-కొత్తకోట ప్రాంతాలకు ఏటా పంటను తరలిస్తున్నారు. గతేడాది కొత్తకోట, యాద్గీర్ ఫ్యాక్టరీలు సక్రమంగా నడవక సంగారెడ్డి పరిశ్రమపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. ప్రస్తుతం టన్నుకు రూ.3,400 ఇస్తున్నట్లు సమాచారం.

అనువైన భూములున్నా..

అదే చెరుకును దళారులకు విక్రయిస్తే టన్నుకు సుమారు రూ.1,700–1,800లు వస్తుంది. అవి కూడా మూడు నెలల తరువాత రైతుకు అందుతుంది. ఫ్యాక్టరీల యాజమాన్యం చెరుకు నాటే సమయంలో విత్తనంతో పాటు కోత సమయంలో కూలీల కొరత లేకుండా చూస్తామని నమ్మిస్తూ.. పట్టించుకోక పోవటంతో దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం చెరుకు ఫ్యాక్టరీలు అందుబాటులో ఉంటే సమయానికి పంటను విక్రయించి అనుకున్న ధర వచ్చేది. అలా లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా అరటి, పసుపు, వరి పంటలను సాగు చేస్తున్నారు. చెరుకు సాగుకు అనుకూలమైన భూములు, వాతావరణం ఉన్నా వసతులు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం స్థానికంగా ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తే చెరుకు సాగుకు ఉపయుక్తంగా ఉంటుందని స్థానిక అన్నదాతలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

రూ.4 వేలు ఇవ్వాలి

విత్తనం నాటినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు 12 నెలల పాటు రాత్రింబవళ్లు రైతులు శ్రమించాలి. రోజు రోజుకు పెరుగుతున్న ఎరువులు, కూలీల ధరలకు గిట్టుబాటు కావటం లేదు. టన్నుకు రూ.4 వేల ధర వచ్చేలా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అన్నదాతలు కోరుతున్నారు. ఎకరా పొలంలో చెరుకు పంటను సాగుచేస్తే సుమారు రూ.20 వేల నుంచి 30 వేల వరకు ఖర్చు అవుతుందని, దిగుబడి ఎకరాకు 20–25 టన్నులు దాటడం లేదని వాపోతున్నారు. దీంతో ఏటా అప్పుల పాలవుతున్నామని, ప్రభుత్వం మద్దతు ధరను కేటాయించాలని కర్షకులు కోరుతున్నారు.

ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి



ఐదేళ్లకు ఓసారి ప్రభుత్వాలు, పాలకులు మారినా మా బతుకులు మారటం లేదు. ఈ ప్రాంత రైతులు చెరుకు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని గతంలో ముఖ్యమంత్రులకు విన్నవించారు. కానీ ఏ ప్రభుత్వం తమ గోడు పట్టించుకోవటం లేదు. ఫ్యాక్టరీలు అందుబాటులో ఉంటే మరో 10వేల ఎకరాలకు సాగు పెరిగేది.

– రాంచంద్రయ్య, రైతు, బండమిదిపల్లి

విన్నపాలు బుట్టదాఖలు



ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి సుమారు పదేళ్లు అవుతున్నా రైతు గోస తీరడం లేదు. ఇక్కడి చెరుకు రైతుల బతుకులు అగమ్యగోచరంగా మారుతున్నాయి. జిల్లాలో చెరుకు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని సుమారు 35 ఏళ్ల నుంచి కోరుతున్నాం. నాయకులు, అధికారులకు ఇచ్చిన వినతిపత్రాలు బుట్టదాఖలవుతున్నాయి.

– ముకుంద్‌రెడ్డి, రైతు, జనగాం

స్పందన లేదు



చెరుకు ఫ్యాక్టరీలు అందుబాటులో లేక ఏడాది కష్టం దళారుల పాలవుతున్నాయి. మధ్యవర్తులు పంటను కోత కోసిన నాటి నుంచి మూడు నెలలకు పైగా డబ్బులు ఇవ్వని ఉదంతాలున్నాయి. అంతే గాకుండా టన్నుకు రూ.300–400 వరకు నష్టపోతున్నాం. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేదు.

– లాలప్ప, రైతు, బుద్ధారం


ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

వైభవంగా హనుమద్వాహనం



అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి స్వామివారు హనుమద్వాహనంపై మాడవీధుల్లో ఘనంగా ఊరేగారు. భక్తుల గోవిందనామాలతో వాహనసేవ భక్తి పరవశంలో మునిగితేలారు. ఆదివారం ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం జరిపించారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

పిల్లలతో ఇతిహాసాలు చదివించాలి

ఆధ్యాత్మికవేత్త డాక్టర్ భాస్కరయోగి



చేవెళ్ల: మన దేశ సంస్కృతి సంప్రదాయలను భావి తారలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ భాస్కర యోగి అన్నారు. మండల కేంద్రంలో హిందూ ధార్మిక సమితి చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీమద్రామాయణ ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే పిల్లలకు తల్లిదండ్రులు రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలు చదివించాలని సూచించారు. ప్రపంచ దేశాలన్నింటిలో భారత దేశ చరిత్ర ఎంతో ప్రాచీనమైనదని తెలిపారు. అనేక దేశాల చరిత్రలు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ భారత చరిత్ర మాత్రం ఇప్పటికీ వర్ధిల్లుతుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయలను మనమే కాపాడుకోవాలన్నారు. మారుతున్న కాలంలో మన ఇతిహాసాల గురించి మరిచిపోయే ప్రమాదం ఉందని అందుకే వాటిని మన పిల్లలకు గుర్తు చేస్తే భావితరాలకు వీటి గురించి తెలుస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలన్నారు. మానసిక ప్రశాంతత ఉంటేనే ఏదైనా సాధించ వచ్చన్నారు. ప్రవచనాల ప్రారంభంలో ఇటీవల విడుదలైన నీట్ పరీక్షలో ప్రతిభ చాటి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉచిత సీటు సాధించిన ఇందు ఆమె తల్లిదండ్రులను హిందూ ధార్మిక సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మండలంలోని పెద్దలు, ప్రజలు, పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో మెరిసిన రంగారెడ్డి


రంగారెడ్డి బాలుర జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఫ్రాబెల్స్ హైస్కూల్ మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో రంగారెడ్డి జిల్లా, ద్వితీయ స్థానంలో ఆదిలాబాద్, తృతీయ స్థానంలో వరంగల్ జట్లు, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో ఖమ్మం, ద్వితీయ స్థానంలో హైదరాబాద్, తృతీయ స్థానంలో వరంగల్ జట్లు నిలిచాయి. విజేతలకు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పీవీ రమణ, జిల్లా అధ్యక్షుడు ఎల్.నర్సింగరావు, కోశాధికారి చిన్నయ్య, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణమూర్తి, రైల్వే కోచ్ శశి కప్‌లు అందించారు.

కుక్కలు అడ్డొచ్చి.. ప్రాణం తీసి

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

పరిగి: వీధి కుక్కలు అడ్డు రావడంతో స్కూటీ అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నర్సయ్యగూడెం గ్రామానికి చెందిన ప్యాట రమేశ్(32) స్కూటీపై పరిగికి పని నిమిత్తం శనివారం రాత్రి వచ్చాడు. పని చేసుకొని ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో కొడంగల్ చౌరస్తాలోని పూజా హార్డ్‌వేర్ ఎదుట వీధి కుక్కలు అడ్డు వచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో అక్కడే ఉన్న డివైడర్‌కు స్కూటీ ఢీకొనడంతో రమేశ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని పోలీసులు తెలిపారు. తల్లి సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

యాచారం: బ్లాక్ మార్కెట్లో విక్రయించడానికి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. కడ్తాల్ మండలం పల్లెచల్కతండాకు చెందిన కృష్ణ మండలంలోని పలు గ్రామాల్లో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి ఆటోలో తన స్వగ్రామానికి తరలిస్తున్నారు. వాహనాల తనిఖీలో ఆదివారం యాచారం పోలీసులు మండల కేంద్రంలో ఆటోను పట్టుకుని, అందులో ఉన్న రేషన్ బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాచారం: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మాల్‌లోని వీటీనగర్‌కు చెందిన భాస్కర్(40) శనివారం రాత్రి నల్గొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రం నుంచి ఆటోలో మండల పరిధిలోని మాల్‌కు వస్తున్నారు. మార్గమధ్యలో మాల్ గ్రామ పంచాయతీ సమీపంలో లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న భాస్కర్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

నేడు మంత్రి పర్యటన

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటగా కడ్తాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభిస్తారు.


ప్రాజెక్టు అలుగు కింద పర్యాటకుల సందడి

కోట్‌పల్లి.. పర్యాటకులు తరలి

మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టులో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. దసరా పండగ సెలవులు కావడంతో నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఫొటోలు, బోటింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. – ధారూరు


సెల్ఫీ తీసుకుంటున్న యువతులు

ప్రాచీన కళలను ప్రోత్సహించాలి


పండ్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

కొడంగల్: భారత దేశ ప్రాచీన కళలను ప్రోత్సహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న కలారీ విద్య శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కలరియ పట్టుకు పూర్వ వైభవం రావడం అభినందనీయమని అన్నారు. యుద్ధ కళలు స్వీయ రక్షణకు ఎంతో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం, స్వీయ రక్షణతో పాటు మనిషికి నమ్మకం విశ్వాసం ఏర్పడుతాయన్నారు. ఈ సందర్భంగా కలారీ విద్యను నేర్చుకుంటున్న విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శిక్షకుడు రమేష్ ఆచార్య, మాజీ సర్పంచులు రమేష్‌బాబు, అంజద్, రేషన్ డీలర్ కానుకుర్తి నర్సిరెడ్డి, పీ.శ్రీనివాస్‌గౌడ్, ఓం ప్రకాశ్, యు.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ యాసిడ్ తయారీ ముఠా...

- గుట్టును రట్టు చేసిన పోలీసులు
- నిందితులపై కేసు నమోదు


నకిలీ యాసిడ్, బ్యాటరీ వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నవాబుపేట: నకిలీ యాసిడ్ బ్యాటరీ వాటర్ తయారు చేసి విక్రయిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. నవాబుపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మూలమాడ గ్రామానికి చెందిన బంట్వారం భోజిరెడ్డి గుట్టు చప్పుడు కాకుండా తన ఇంట్లో కొంత కాలంగా నకిలీ యాసిడ్, బ్యాటరీ డిస్టిల్డ్ వాటర్ బాటిల్స్ తయారు చేసి ఒరిజినల్స్ పేరుతో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు ఒరిజినల్స్ పేరుతో అమ్ముతున్నాడు. విషయం తెలుసుకున్న నవాబుపేట పోలీసులు, ట్రాస్క్‌ఫోర్స్ సహాయంతో ఆదివారం ఉదయం భోజిరెడ్డి ఇంటిపై దాడులు నిర్వహించారు. అతడి ఇంట్లో లభించిన 50 నకిలీ యాసిడ్ బాక్సులు, 134 నకిలీ బ్యాటరీ డిస్టిల్డ్ వాటర్ బాటిళ్లు, సరఫరా చేసే వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడికి అవార్డు


దోమ: అంబేడ్కర్ జాతీయ అవార్డును అందుకుంటున్న రమేశ్‌బాబు

దోమ: ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎన్.రమేశ్‌బాబు అంబేడ్కర్ జాతీయ అవార్డును అందుకున్నారు. ఆదివారం తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ ఎనిమిదో జాతీయ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. వివిధ సేవల్లో విశేష కృషి చేసిన నేపథ్యంలోనే ఈ అవార్డు దక్కిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. సమాజంలో అన్ని వర్గాల అభివృద్ధి కోసం, అందరి విద్య కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాల్సిన అవసరం ఉందన్నారు. యువత వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నతమైన శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేయాలన్నారు.

చర్లగూడవాసికి..

షాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన సేవలు మరువలేనివని బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్ఏ) జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 8వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో షాబాద్ మండలం చర్లగూడ గ్రామానికి చెందిన చౌక్కంపేట ఆంజనేయులుకు అంబేడ్కర్ జాతీయ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బీఎస్ఏ ఆధ్వర్యంలో ఏటా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆంజనేయులు మాట్లాడుతూ.. నవ సమాజ నిర్మాణమే లక్ష్యంగా బహుజన సాహిత్య అకాడమీ ముందుకు పోతుందన్నారు. ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఎస్ఏ కార్యదర్శి విష్ణువర్ధన్, రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

నవ వధువు అదృశ్యం

షహాడీషరీఫ్: నవ వధువు అదృశ్యమైన సంఘటన షహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి గ్రామానికి చెందిన యంజాల పెద్దిరాజ్ వివాహం ఏడు నెలల క్రితం అర్చనతో జరిగింది. పెళ్లైన మూడు నెలల వరకు సజావుగానే సాగిన వీరి దాంపత్య జీవితం.. అనంతరం ఆమె భర్తను దూరం పెడుతూ వచ్చింది. తరచూ వేరే వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడేది. ఈ క్రమంలోనే ఈ నెల 1న ఇంట్లో ఎవరూ లేని సమయంలో బంగారు నగలు, దుస్తులు తీసుకొని వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వీధి కుక్కల పట్టివేత


శునకాన్ని బంధిస్తున్న సిబ్బంది

తాండూరు టౌన్: కుక్కల దాడిలో చిన్నారులు గాయపడటంతో మున్సిపల్ అధికారులు కదిలారు. వీధి శునకాలను నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఆదివారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కుక్కలను పట్టివేశారు. పట్టణంలో వీధి కుక్కల దాడిని అరికట్టాలంటూ కొంత కాలంగా మున్సిపల్ అధికారులపై పట్టణ వాసులు ఒత్తిడి తెచ్చారు. ఈమేరకు బృంద సభ్యులు వల వేసి వీధి కుక్కలను బంధించి వాటిని అంతారం సమీపంలోని మున్సిపల్ డంపింగ్ యార్డులో గల ఎనిమల్ కేర్ సెంటర్‌కు తరలించారు. ఇక్కడే శునకాలకు స్టెరిలైజేషన్ చేయించనున్నట్లు అధికారులు తెలిపారు.